సాక్షి జోగుళాంబ గద్వాల

బుధవారం, 9, ఏప్రిల్, 2025



కనులపండువగా..
సిర్సనగండ్లలో సీతారామచంద్రస్వామి పూల రథోత్సవం కనులపండువగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



జోరుగా ఉల్లి విక్రయాలు
దేవరకద్ర మార్కెట్‌యార్డులో మంగళవారం ఉల్లి విక్రయాలు జోరుగా కొనసాగాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /22.6

వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది. వడగాల్పులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బీచుపల్లిలో ముగిసిన పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు



ఎర్రవల్లి: శ్రీరామ నవమిని పురస్కరించుకొని బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో నిర్వహించిన పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తిరువారాధన, యాగశాల చతుస్థానార్చన, చక్రస్నానం, మహా పూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ వంటి పూజలు చేశారు. సాయంత్రం ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం, ధ్వజావరోహణం, వేద ఆశీర్వచనం కార్యక్రమాలను వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అర్చకులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి



గద్వాలటౌన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని గద్వాల ప్రభుత్వ పీజీ సెంటర్‌లో మంగళవారం కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. జీఓ 21ని వ్యతిరేకిస్తూ తరగతులను బహిష్కరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రిన్సిపల్ వెంకటరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 21తో కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని ఆందోళన వ్యక్తంచేశారు. యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని.. పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగళగిరి శ్రీనివాసులు, మహేందర్, గోపినాథ్ రాథోడ్, వంగూరి గణేశ్ పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.5,949

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు మంగళవారం 1,695 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా.. క్వింటాల్ గరిష్టంగా రూ. 5,949, కనిష్టంగా రూ. 3,069, సరాసరి రూ. 5,199 ధరలు వచ్చాయి. 36 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా.. గరిష్టంగా రూ. 6,529, కనిష్టంగా రూ. 6,009, సరాసరి రూ. 6,529 ధరలు లభించాయి. 40 క్వింటాళ్ల ఆముదాలు అమ్మకానికి రాగా.. గరిష్టంగా రూ. 6,009, కనిష్టంగా రూ. 5,661 ధర పలికింది. 424 క్వింటాళ్ల వరిధాన్యం (సోన) రాగా.. గరిష్టంగా రూ. 2,030, కనిష్టంగా రూ. 1,759, సరాసరి రూ. 2,019 ధరలు లభించాయి.

పొగాకు రైతు పరేషాన్

అకాల వర్షాలకు నల్లబారుతున్న పొగాకు మండెలు



మానవపాడు మండలంలో వర్షానికి తడిసిన పొగాకు

- కంపెనీలు ఆశచూపడంతో విస్తారంగా సాగు
- తీరా పంట చేతికి వచ్చాక.. ఆ రకానికి మార్కెట్ లేదంటూ వెనుకంజ
- దిక్కుతోచని స్థితిలో పొగాకు రైతులు

ఉండవెల్లి: ఓ వైపు అకాల వర్షాల భయం.. మరోవైపు డిమాండ్ ఉన్న రకాలను మాత్రమే కొంటామంటూ ఆయా కంపెనీల నిర్వాహకులు నిబంధనలు పెడుతుండడం.. మొత్తంగా పొగాకు రైతులు పరేషాన్‌లో పడ్డారు. పొగాకులో 62 రకాలు ఉండగా.. ప్రధానంగా బీడీ, సిగరెట్, చుక్కబర్లీ, బర్లీ, అడ్–50, కస్తూరికి డిమాండ్ ఎక్కువ. గత ఏడాది పొగాకు పంటకు అధిక ధర పలకడంతో ఈ సారి కూడా లాభాలు వస్తాయని, విస్తారంగా సాగు చేయాలని ఆయా కంపెనీల నిర్వాహకులు సూచించడంతో రైతులు పొగాకులో ప్రధాన రకాలైన సిగిరేట్, బీడీని అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి అందుతుంది. ఈ పరిస్థితుల్లోనే రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. అటు అకాల వర్షాలతో ఎండకు ఆరబెట్టిన పొగాకు మండెలు నల్లబారుతున్నాయి. కొనుగోళ్లు ఆలస్యమైతే మరింత నష్టపోయే అవకాశం ఉందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు బయటి మార్కెట్‌లో బీడీకి రకానికి మార్కెట్ లేదంటూ కేవలం సిగరెట్ రకాన్ని మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో బీడీ రకం పొగాకు సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇటీవల బీడీ రకాన్ని సాగు చేసిన రైతులు సదరు ప్రైవేట్ కంపెనీ వద్దకు పంట విక్రయించే నిమిత్తం వెళ్లగా.. కంపెనీ వద్దకు రావద్దని తేల్చి చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షంతో బూజు పడుతోంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీడీ రకం పొగాకు అధిక మోతాదులో సాగు చేశారు. గద్వాల, అలంపూర్, వనపర్తి, కొల్లాపూర్, నియోజకవర్గాలలోని గ్రామాలకు చెందిన రైతులు పంటను సాగు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో 2 వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. జోగుళాంబ గద్వాల వ్యాప్తంగా 3500 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేయగా.. కేవలం అలంపూర్ నియోజకవర్గంలోనే 2500 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది పొగాకు క్వింటాకు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు పలికింది. ఈ ఏడాది వచ్చేసరికి అమాంతం ధర పడిపోయింది. క్వింటా రూ.11 వేల నుంచి రూ.13 వేల వరకు పలుకుతుండడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా పొగాకు మండలను దింపడం ప్రారంభించారు. ఇదిలాఉండగా, గత పది రోజులుగా కురుస్తున్న వర్షంతో మండలు నల్లబారి బూజు పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

న్యాయం చేయాలి

పొగాకు మండలను తిప్పి తిప్పి చేతులు అరిగి పోయాయి. ఎన్నో ఇబ్బందులు పడి పంటను సాగు చేశాం. తీరా పంట విక్రయిద్దామంటే ఆయా కంపెనీలు రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి. కొన్ని కంపెనీలు గతంలో రైతులను అడిగి మరి కొనుగోలు చేశారు. ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాం. ఎక్కడ పంట నల్లగా మారుతుందోనని ఆందోళన చెందుతున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించి పొగాకు రైతులకు న్యాయం చేయాలి.

– వెంకటేశ్వర్లు, పొగాకు రైతు, ఉండవెల్లి

కుదేలవుతున్నారు..



తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలలో మాత్రమే పొగాకు పంటను సాగు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రైతు పొగాకు పండించే ముందు మీరు సాగు చేయండి.. మేం కొంటామంటూ నమ్మబలికారు. తీరా పంట చేతికి వచ్చిన సమయంలో కంపెనీ యజమానులు చేతులెత్తేస్తున్నారు. మొత్తంగా పొగాకు సాగు చేసిన రైతు కుదేలవుతున్నారు. జిల్లా అధికారులు రైతుల బాధలు పట్టించుకోవడం లేదు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పొగాకు కంపెనీల యజమానులతో మాట్లాడి రైతులకు న్యాయం అందేలా చూడాలి.

– ఈదన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



ఉండవెల్లిలో వర్షానికి నేలకొరిగిన పొగాకు మండెలపై అడ్డుగా కప్పిన కవర్లు

కొనుగోళ్లకు కంపెనీల అనాసక్తి

పొగాకు కంపెనీలు అయిన వీఎస్‌టీ, ఐటీసీ, అలియాన్స్, జీపిఐ, బొమ్మిడాల్, డెక్కన్, నూర్, తదితర కంపెనీలు ఉండవెల్లి, అలంపూర్ మండలాల్లోనే అధికంగా ఉన్నాయి. బీడీ రకం పొగాకు, చుక్కబర్లీ, రకాలు త్వరగా కొంటారని ఎంతో ఆశపడి రైతులు సాగు చేశారు. ఒక్కో రైతు 10 ఎకరాలకు పైగా పొగాకును సాగు చేశారు. కానీ తీరా పంట చేతికి వచ్చే సమయంలో బయటి మార్కెట్‌లో ఏ రకానికి డిమాండ్ ఉంటే అదే కొనుగోలు చేస్తామంటూ కేవలం సిగరేట్ రకాన్ని కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. దీంతో మిగతా రకాలు సాగు చేసిన రైతులు ఎక్కడ అమ్ముకోవాలో తెలియక సతమతమవుతున్నారు. కొన్ని కంపెనీలు మీరు ఎంత సాగు చేసినా.. మేం ఇంత మేర మాత్రమే కొంటామని పేర్కొంటున్నాయి. మరికొన్ని ఈ ధర ఇస్తేనే కొనుగోలు చేస్తామని తేల్చి చెబుతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు పడ్డారు.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పొగాకు

ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల: యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు సంబంధిత అధికారులు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. యాసంగి ధాన్యం కొనుగోళ్లను ఈ నెల మూడో వారంలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో పొందుపర్చాలని తెలిపారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఎదురైనా ఇబ్బందులు పునరావృతం కాకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని అన్నారు. సమావేశంలో డీఎస్ఓ స్వామి, డీఎం విమల, డీఏఓ సక్రియ నాయక్ తదితరులు ఉన్నారు.

తుది దశకు జాతీయ రహదారి-167కే నిర్మాణం

- కొల్లాపూర్, కల్వకుర్తి పరిధిలో జూలైలోగా పూర్తిచేసేందుకు చర్యలు
- నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కొలిక్కిరాని భూసేకరణ
- ఇప్పటికే పూర్తయిన పాత రోడ్డు విస్తరణ పనులు
- త్వరలోనే ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జికి టెండర్లు

శరవేగంగా..



కొల్లాపూర్ సమీపంలో చేపడుతున్న ఫ్లెఓవర్ నిర్మాణం

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలో జాతీయ రహదారి–167కే పనులు శరవేగంగా సాగుతున్నాయి. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల గుండా వెళ్లే ఈ రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. గతంలో ఉన్న రహదారి విస్తరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బైపాస్ రహదారుల నిర్మాణాలు 90 శాతం మేరకు పూర్తి కాగా.. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మాత్రమే బైపాస్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

■ భారత్‌మాల పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల వరకు జాతీయ రహదారి–167కే మంజూరు చేసింది. ఇందులో భాగంగా మల్లేశ్వరం– సంగమేశ్వరం మధ్యన కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. మొదటి ప్యాకేజీలో కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 85 కి.మీ., మేరకు రహదారి విస్తరణ, బైపాస్, అండర్‌పాస్ నిర్మాణాలు చేపట్టేందుకు 2021 సెప్టెంబర్ 26న టెండర్లు పూర్తిచేశారు. రూ.436.91 కోట్లకు ఆర్‌కే ఇన్‌ఫ్రా టెండర్ దక్కించుకుంది. 2023 జూలైలో కాంట్రాక్టు కంపెనీ పనులను ప్రారంభించింది. పనులు పూర్తిచేసేందుకు రెండేళ్లు గడువు విధించారు. వచ్చే జూలైలో కాంట్రాక్టు కంపెనీ గడువు ముగుస్తుంది. అప్పటిలోగా పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.

ఆరు నెలల గడువు..

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బైపాస్ రహదారులు నిర్మిస్తున్నారు. ఇందుకోసం భూసేకరణ చేపట్టారు. కొల్లాపూర్, కల్వకుర్తిలో భూసేకరణ పూర్తికావడంతో బైపాస్ నిర్మాణాలు కూడా తుదిదశకు చేరాయి. నాగర్‌కర్నూల్‌లో మాత్రం భూసేకరణలో జాప్యం నెలకొంది. దీంతో ఈ పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టు కంపెనీకి ఆరునెలల అదనపు సమయం ఇచ్చేందుకు ఎన్‌హెచ్ అధికారులు సిద్ధమయ్యారు. భూ సేకరణ జరిగిన ప్రాంతాల్లో మాత్రం వచ్చే జూలైలోగా పనులు పూర్తికానున్నాయి.

రెండు రాష్ట్రాల్లోనూ జోరుగా..

రహదారి నిర్మాణ పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించారు. కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు మొదటి ప్యాకేజీ, కృష్ణానదిపై ఐకానిక్ వంతెన రెండో ప్యాకేజీ, వంతెనకు అనుసంధానంగా మల్లేశ్వరం, సంగమేశ్వరం ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలు మూడో ప్యాకేజీలో, నంద్యాల నుంచి ఆత్మకూరు వరకు రహదారి విస్తరణ పనులను నాలుగు, ఐదు ప్యాకేజీల్లో చేర్చారు. అయితే 1, 4, 5 ప్యాకేజీ పనులు దాదాపుగా తుది దశకు చేరాయి. మూడో ప్యాకేజీ పనుల కోసం త్వరలోనే టెండర్లు పిలవనున్నారు.

ఈనెలాఖరు చివరి గడువు

జాతీయ రహదారి–167కేలో భాగంగా 87.36 కి.మీ., నుంచి 88.43 కి.మీ., మధ్యలో కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ పనుల కోసం 2023 అక్టోబర్‌లో టెండర్లు ఆహ్వానించారు. తర్వాతి కాలంలో బ్రిడ్జి నిర్మాణంలో పలు మార్పులు చేయడం వల్ల టెండర్ల గడువును పొడిగిస్తూ వస్తున్నారు. రూ.963 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ బ్రిడ్జి పనులకు టెండర్ల గడువును ఈ నెల 29 చివరి గడువుగా విధించారు. టెండర్లలో పాల్గొనేందుకు పలు నేషనల్, ఇంటర్నేషనల్ కంపెనీలు బిడ్లు దాఖలు చేశాయి. మే నెలలో టెండర్లు ఓపెన్ చేసే అవకాశాలు ఉన్నాయి.

ముమ్మరంగా ఫ్లైఓవర్ పనులు

కొల్లాపూర్ సమీపంలో బైపాస్ రహదారి వెంట ఫ్లైఓవర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సింగోటం క్రాస్‌రోడ్ వద్ద, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో పెంట్లవెల్లి రోడ్డు పక్కన పిల్లర్లు నిర్మించారు. పై భాగంలో స్లాబ్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఫ్లైఓవర్ సైడ్ గోడలు ఏర్పాటు చేశారు. చౌటబెట్లకు వెళ్లే దారిలో మూలవాగుపై భారీ కల్వర్టు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతం చౌరస్తాగా రూపుదిద్దుకోనుంది. సోమశిలకు వెళ్లే రోడ్డులో బైపాస్ పనులు తుది దశలో ఉన్నాయి.



చౌటబెట్లకు వెళ్లే దారిలో వాగుపై నిర్మిస్తున్న భారీ కల్వర్టు

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

అయిజ/మల్దకల్: విద్యార్థులు శ్రద్ధగా ఉన్నత విద్య **అభ్యసిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటు**ందని జిల్లా **న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,** సీనియర్ సివి**ల్‌జడ్జి గంట కవితాదేవి అన్నారు.** మంగళవారం **మండలంలోని పులికల్ ఉన్నత పాఠ**శాలలో ఆక**స్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భం**గా విద్యార్థు**లకు కల్పిస్తున్న వసతులు, మధ్యాహ్న** భోజనం వం**ట సరుకులను న్యాయమూర్తి పరిశీలిం**చారు. అనం**తరం విద్యార్థులకు చట్టాలపై అవగా**హన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని.. ఎక్కడైనా బాల్యవివాహం చేసేందుకు సిద్ధమైతే పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలకు 5 కి.మీ. దూరంలోని బైనపల్లి, కిసాన్ నగర్, రాజాపురం గ్రామాల నుంచి వస్తున్నామని, తమకు సైకిళ్లు ఇప్పించాలని విద్యార్థులు కోరగా.. దాతలతో మాట్లాడి సైకిళ్ల పంపిణీకి కృషిచేస్తానని న్యాయమూర్తి హామీ ఇచ్చారు.

■ మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని సీనియర్ సివిల్‌జడ్జి కవితాదేవి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. న్యాయమూర్తిని శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రవిచారి, చంద్రశేఖర్‌రావు, మధుసూదనాచారి పాల్గొన్నారు.



పులికల్ ఉన్నత పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి కవితాదేవి

రాజీవ్ యువవికాసానికి దరఖాస్తు చేసుకోండి

ఇటిక్యాల: ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువవికాసం పథకానికి అర్హులైన యువత దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ ఉన్నారు.

కేటగిరీల వారీగా కేటాయింపులు

గద్వాల: రాజీవ్ యువవికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు ప్రత్యేకంగా కేటాయింపులు చేశారు. ఈ పథకంలో దివ్యాంగులకు 5 శాతం, ఒంటరి మహిళలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి సునంద ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్, ఆదాయం, కుల ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ (ట్రాన్స్‌పోర్ట్ పథకం కోసం), పట్టాదారు పుస్తకం (వ్యవసాయ సంబంధిత పథకానికి), సదరం ధ్రువపత్రం, వితంతు, ఒంటరి మహిళల ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జతపరిచి మండల పరిషత్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో అందించాలని సూచించారు.



ఇటిక్యాలలో దరఖాస్తుల వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

వంటింటికి గ్యాస్ సెగ



- గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50 పెంపు
- సబ్సిడీని పూర్తిగా ఎత్తేసిన ప్రభుత్వం
- జిల్లా వినియోగదారులపై ప్రతినెలా రూ. 35లక్షలకు పైగా భారం

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు ఇలా..

గృహ వినియోగదారులు :	కమర్షియల్
1,37,146	7,941
ఉజ్వల పథకం :	**ఇతరాత్ర**
30,360	1,131

2020 నుంచి గృహవినియోగ సిలిండర్ ధరల పెంపు ఇలా..

సంవత్సరం	నెల	ధర (రూ.లలో)
2020	మార్చి	880
2020	ఏప్రిల్	816
2021	జనవరి	765
2022	జనవరి	973
2022	మార్చి	1,023
2022	మే	1,075
2022	జూలై	1,125
2023	మార్చి	1,175
2023	నవంబర్	1,125
2023	డిసెంబర్	975
2024	మార్చి	875
2025	ఏప్రిల్	925

గద్వాలటౌన్: నిత్యావసరాల ధరలు సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వంట నూనెలు సలసలమంటుండగా.. కూరగాయలు కంటతడి పెట్టిస్తున్నాయి. వీటికే సామాన్యుల వంటగది ఉక్కిరిబిక్కిరవుతోంది. దీనికి తోడు గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతుండటంతో పేదల నెలవారీ బడ్జెట్ తలకిందలవుతోంది. తాజాగా గృహ వినియోగ 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెరగడం మరింత గుదిబండగా మారింది.

■ జిల్లాలో మొత్తం 11 ఏజెన్సీలు ఉండగా.. వాటి పరిధిలో వివిధ రకాలకు చెందిన మొత్తం 1,76,578 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 1,68,637 కనెక్షన్లు గృహ వినియోగానికి సంబంధించినవి ఉన్నాయి. గతంలో వీటిపై ప్రభుత్వం రాయితీ ఇచ్చేది. రానురాను ఏడాదికి ఆరు సిలిండర్లకే రాయితీని పరిమితం చేశారు. సిలిండర్ ధరలు పెరుగుతుండటంతో పాటు రాయితీ తగ్గిపోయింది. ప్రస్తుతం సబ్సిడీని కూడా పూర్తిగా ఎత్తేశారు. అయితే ఉజ్వల పథకం కింద ఉచితంగా వంట గ్యాస్ సిలిండర్లు పొందిన వారికే మాత్రమే రాయితీ దక్కనుంది. తాజాగా రూ.50 పెరగడంతో ప్రస్తుతం గృహవినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.925కు చేరుకుంది. అయితే జిల్లాలో ప్రతినెలా సరాసరి 70వేల గృహవినియోగ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు అంచనా. తాజా పెంపుతో గృహ సిలిండర్ వినియోగదారులకు ప్రతినెలా రూ. 35లక్షల వరకు అదనపు భారం పడనుంది.

రెండేళ్లుగా తగ్గుతూ..

గ్యాస్ ధరలు రెండేళ్ల క్రితం భారీగా పెరగడంతో ప్రజలు సతమతమయ్యారు. తర్వాత క్రమంగా ధరలు తగ్గుతూ వచ్చాయి. 2023 మార్చి వరకు రూ. 1175 ఉన్న ధర.. నవంబర్‌లో రూ. 1,125కు చేరింది. తర్వాత నెల రోజులకే రూ.975కు తగ్గింది. ఇలా నాలుగు నెలలపాటు కొనసాగిన ధర 2024 మార్చిలో రూ. 875కు తగ్గింది. అప్పటి నుంచి ఏడాది పాటు ధర స్థిరంగా ఉంటూ వస్తోంది. తాజాగా గృహ వినియోగదారుల గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెరిగింది. మహాలక్ష్మి, దీపం పథకం లబ్ధిదారులపై మాత్రం పెరిగిన ధర ప్రభావం ఉండదు.

భారం మోపడం తగదు..



వంట గ్యాస్ వాడకాన్ని ప్రభుత్వాలే అలవాటు చేశాయి. సబ్సిడీలు ఇచ్చి మరీ కొనిపించారు. సబ్సిడీ నగదు క్రమేణ ఎత్తేశారు. రవాణా చార్జీలను అదనంగా తీసుకుంటున్నారు. ఇప్పుడు సిలిండర్‌పై రూ.50 ధర పెంచడం దారుణం. ఇప్పటికే అన్ని రకాల ధరలు పెంచేసి జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నారు. సామాన్యులపై మోయలేని భారం మోపడం తగదు. – రేణుక, గృహిణి, గద్వాల

వంటావార్పు కష్టమే..



అన్ని రకాల ధరలు ఆకాశాన్నంటాయి. ఏం కొనలేం.. తినలేం అనే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గ్యాస్ ధర పెరగడంతో వంట వండుకునే పరిస్థితి కూడా లేకుండా పోతుంది. సిలిండర్ ధర పెరిగిందని.. కట్టెల పొయ్యి మీద వండుకునే పరిస్థితి లేదు. పేదలకు ఈ ధరల పెరుగుదల భారంగా మారుతుంది. – సావిత్రి, గృహిణి, గద్వాల

క్లుప్తంగా

బస్సు, బైక్ ఢీ : ఒకరి దుర్మరణం



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ స్టేజీ వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం బస్సు, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. ఆయన కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేటకు చెందిన కింగ్లీకార్ ప్రవీణ్ కుమార్(40), అతడి స్నేహితుడు గోపీకృష్ణ పెద్దాపూర్‌లో ఉన్న స్వామి గురూజీని కలవడానికి బైక్‌పై వస్తున్నారు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళ్తున్న అచ్చంపేట డిపోకు చెందిన బస్సు పెద్దాపూర్ స్టేజీ వద్ద నిలిచిన బస్సును దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్, గోపీకృష్ణకు గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవీణ్‌కుమార్ మృతిచెందాడు. భార్య అక్షర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. గోపీకృష్ణ మిఠాయి దుకాణంలో పని చేస్తుండగా.. ప్రవీణ్‌కుమార్ బడంగ్‌పేటలో మటన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు.

మహిళ బలవన్మరణం

రాజోళి: కుటుంబ సమస్యలతో ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన కటిక లలితాబాయి (58)కి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త చంద్రారావు మానసికంగా సక్రమంగా లేకపోవడం, కుమారులకు వివాహాలు కాక పోవడం, వ్యాపారాలు సాగకపోవడంతో మనోవేదనకు గురై సోమవారం రాత్రి పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పెద్ద కుమారుడు కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాలకృష్ణ(ఫైల్)

మదనాపురం: తల్లి గొడ్డలితో దాడి చేయగా గాయపడ్డ కొడుకు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు సీఐ శివకుమార్ తెలిపారు. వివరాలు.. మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన కోటకొండ బాలకృష్ణ (35) పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఏడాదిగా బాలకృష్ణ బదులు తల్లి లక్ష్మి పనిచేస్తుంది. ఈ నెల జీతం కుమారుడు ఖాతాలో పడింది. 3వ తేదీన డబ్బులు ఇవ్వమని లక్ష్మి కొడుకును కోరింది. దీంతో తల్లీకొడుకుల మధ్య గొడవ జరిగింది. లక్ష్మి గొడ్డలితో కొడుకుపై దాడి చేసింది. చిన్నకుమారుడు రవి హుటాహుటిన బాలకృష్ణను వనపర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య కోసం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఖిల్లాఘనపురంలో బాలిక..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన సుష్మ(10) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన అక్కి శ్రీశైలంకు సుష్మ (10), నిశిత కుమార్తెలు. వీరిద్దరు ఈ నెల 6న గొర్రెలు మేపుతుండగా.. సుష్మ అకస్మాత్తుగా కూలి పడి నోటిలో నుంచి నురగ వచ్చింది. గుర్తించిన నిశిత వెంటనే తండ్రికి సమాచారం ఇచ్చింది. ఆయన వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. విష పురుగు కరిచి తమ కుమార్తె మృతి చెందిందని తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గుర్తుతెలియని జంతువు దాడిలో ఆవు మృతి

ధరూరు : మండలంలోని మార్లబీడుకి చెందిన రైతు బాయిదొడ్డి రాజుకు చెందిన ఆవుపై ఓ గుర్తు తెలియని జంతువు దాడి చేయగా మృతిచెందింది. బాధితుడు తెలిపిన వివరాలు.. మార్లబీడుకి చెందిన రైతు బాయిదొడ్డి రాజు పొలం ధరూరు గట్టు శివారులో ఉంటుంది. పశువులను అక్కడే కట్టేసిన రైతు మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా.. ఆవు గొంతు భాగం రక్తగాయాలతో కనిపించింది. దీంతో రైతు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించగా వారు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనఊపిరితో ఉన్న ఆవు మధ్యాహ్నం మృతిచెందింది. బాధిత రైతును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు రాఘవేంద్ర, మార్లబీడు గ్రామస్తులు కోరారు.

46 రోజులుగా శ్రమిస్తున్నారు..



సొరంగం లోపల సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

- మరోసారి కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు ప్రారంభం
- ఈ నెల 16 వరకు 70 మీటర్ల శిథిలాలు తొలగించేలా ముందుకు..
- ఎస్‌ఎల్‌బీసీలో ముమ్మరంగా సహాయక చర్యలు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం లోపల సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సొరంగం పైకప్పు కూలిన ఘటన జరిగి మంగళవారం నాటికి 46 రోజులు గడవగా.. సొరంగం లోపల మట్టి, బురద, రాళ్లు, టీబీఎం బాగాల తొలగింపు పనులు వేగవంతమయ్యాయి. అలాగే ఎప్పటికప్పుడు వెంటిలేషన్ పనులు చేపడుతున్నారు. మంగళవారం రాత్రి షిఫ్టుకు వెళ్లిన సహాయక సిబ్బంది కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 13.730 కి.మీ., వరకు కన్వేయర్ బెల్టు ఉండగా మరో 70 మీటర్ల మేర దీనిని పొడిగించనున్నారు. ఈ నెల 11 వరకు నాలుగు రోజుల పాటు కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు కొనసాగనుండగా.. ఈ సమయంలో మట్టి, బురద బయటకు తరలించడం సాధ్యం కాదు. కన్వేయర్ బెల్టు పొడిగింపు ఇదే చివరి అవకాశంగా అధికారులు చెబుతున్నారు. తొలగించిన టీబీఎం బాగాలు, రాళ్లు, శిథిలాలను లోకో ట్రైన్ ప్లాట్‌ఫాం ద్వారా బయటకు తరలిస్తారు. మిగిలిన 70 మీటర్ల వరకు ఉన్న శిథిలాలను ఈ నెల 16 వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో సహాయక బృందాలు చర్యలు చేపడుతున్నాయి. సొరంగం పైకప్పు కూలిన 13.938 కి.మీ., ప్రదేశం అత్యంత ప్రమాదకరమైనదిగా నిర్ధారించి 45 మీటర్ల వరకు కంచె ఏర్పాటు చేశారు. అక్కడ తవ్వకాలు చేపట్టే అవకాశం లేకపోవడంతో మిగిలిన 70 మీటర్ల వరకు ఉన్న మట్టి, బురద, రాళ్లు, టీబీఎం బాగాలను తొలగించే ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

వెంటిలేషన్ కొనసాగింపు..

సొరంగం లోపల మట్టి తవ్వకాలకు అనుగుణంగా వెంటిలేషన్ పనులు కొనసాగిస్తున్నారని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. మంగళవారం ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్ద జేపీ కార్యాలయంలో సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్షా నిర్వహించి సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద ప్రదేశంలో ఎలాంటి చర్యలు చేపట్టకుండా మిగిలిన ప్రదేశంలో సహాయక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఐదు ఎస్కవేటర్ల సహాయంతో మట్టి తవ్వకాలు చేపడుతూ కన్వేయర్ బెల్టు ద్వారా మట్టి బయటకు తరలిస్తున్నామని చెప్పారు. సొరంగంలో నిరంతరాయంగా వస్తున్న నీటి ఊటను అత్యధిక సామర్థ్యం కలిగిన పంపుల ద్వారా బయటకు పంపింగ్ చేస్తున్నామన్నారు.

కనులపండువగా పూల రథోత్సవం



సిర్సనగండ్ల దేవాలయ ఆవరణలో పూలతేరు లాగుతున్న భక్తులు

- అర్చకుల ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునా పూల రథోత్సవం (చిన్నతేరు) కనులపండువగా సాగింది. ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ అంజనేయులు, మేనేజర్ నిరంజన్ అర్చకులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, భక్తులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై దత్తాత్రేయ గుడి, ముక్కిండి పోచమ్మ, మైసమ్మ దేవాలయాలను దర్శించుకొని నైవేద్యం సమర్పించారు. మేళతాళాలు, భజనలు, భక్తుల శ్రీరామనామస్మరణతో రథం ముందుకు సాగింది. రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం స్వామివారి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు క్యూలైన్‌ద్వార స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు మురళీధర్ శర్మ, లక్ష్మణ్ శర్మ, వేణు శర్మ, ఆనంద్ శర్మ, గోపి శర్మ, భాస్కర్ శర్మ, ప్రవీణ్ శర్మ భక్తులు పాల్గొన్నారు.



క్యూలైన్లలో భక్తులు

నేటి రాత్రి పెద్ద రథోత్సవం

బుధవారం అర్ధరాత్రి దాటాక పెద్ద రథోత్సవం ప్రారంభమవుతుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఆలయ ఈఓ అంజనేయులు తెలిపారు.

వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పెంచిన వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓ వైపు నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుడు బతకలేని స్థాయిలో ఉంటే మరో వైపు గ్యాస్ ధరలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. పేదలకు అందించే ఉజ్వల గ్యాస్ సిలిండర్‌పై కూడా రూ.50 పెంపు మోయలేని భారమేనన్నారు. అంబానీ, అదానీలకు ఆదాయం కట్టబెట్టడానికే ధరల పెంపని తేట తెల్లమవుతుందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు పడిపోతే.. దేశంలో మాత్రమే పెరిగిందని సాకు చూపుతూ ధరల పెంపు ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కార్యదర్శి గీత, కమిటీ సభ్యులు మాధవి, సత్యమ్మ, సింధు, పద్మ, మహిళలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య సభ్యులు

రెట్టింపు లాభాలొచ్చే పరిశోధనలు రావాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- దక్షిణ తెలంగాణలో పప్పు దినుసులు, నూనెగింజల సాగు అధికం: పీజేటీఏయూ పరిశోధన సంచాలకులు డా.ఎం.బలరాం

బిజినేపల్లి : వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ద్వారా రైతులకు రెట్టింపు లాభాలు అందించేలా పరిశోధనలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలో దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ సలహా సంఘం చర్చా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడారు. పరిశోధనల ద్వారా సత్ఫలితాలిచ్చిన మేలు రకం పంటలను రైతులకు అందించాలని, సరైన యాజమాన్య పద్ధతులను వారికి సకాలంలో వివరించి దిగుబడులు పెంచాలన్నారు. వాణిజ్య పంటలనే కాకుండా ధాన్యం పంటలను రైతులు సాగు చేసేలా చూడాలన్నారు. పీజేటీఏయూ పరిశోధన సంచాలకులు డా.ఎం.బలరాం మాట్లాడుతూ దక్షిణ తెలంగాణ ప్రాంతంలో ఆహార పంటలు, పప్పు దినుసులు, నూనెగింజల పంటలు అధికంగా పండిస్తారని అన్నారు. గత సంవత్సరం సాగులో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ విశ్వవిద్యాలయం అధిక దిగుబడుల్ని, చీడపీడలను తట్టుకునే వంగడాలను సృష్టించాలన్నారు. స్వల్పకాల పరిమితి రకాలను వృద్ధి చేయాలన్నారు. విస్తరణ సంచాలకులు డా.యం.యాకాద్రి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పద్ధతులను, సమాచారాన్ని వివిధ రకాల వినూత్న కార్యక్రమాలను చేపడుతూ రైతులకు సమయానుసారంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డా.సుధాకర్, శాస్త్రవేత్తలు సూచరిత, రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్

డీఆర్ డిపోలకు పూర్వ వైభవం తెస్తాం



జీసీసీ చైర్మన్ తిరుపతిని సన్మానిస్తున్న నాయకులు

మన్ననూర్: రాష్ట్రంలోని గిరిజన కోఆపరేటివ్ సంస్థల (జీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఆర్ డిపోలకు పూర్వ వైభవం తీసుకువస్తామని సంస్థ రాష్ట్ర చైర్మన్ కోట్నావత్ తిరుపతి అన్నారు. మంగళవారం మన్ననూర్‌లోని జీసీసీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను జీసీసీ మేనేజర్ సంతోష్‌కుమార్, చెంచు సంఘాల నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ ప్రాంతంలోని చెంచులు కనీస జీవనోపాదులు లేక తీవ్ర ఇబ్బందులతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. గతంలో జీసీసీ ఈ ప్రాంతంతోపాటు పరిసర జిల్లాల్లో కూడా ఎంతో ప్రాధాన్యతలో కార్యక్రమాలు ఉండేవని వివరించారు. కొంతకాలంగా అటవీ ఉత్పత్తులు లేక చెంచులు జీవనోపాధి కోల్పోయి ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం, ఇతర ఉచిత పథకాలపై ఆధారపడి జీవనం గడుపుతున్నారని వాపోయారు. దక్షిణ తెలంగాణ అమరనాథ్ యాత్రగా చెప్పుకునే సలేశ్వరం ఉత్సవాలను కనీసం 5 రోజులు నిర్వహించుకునే విధంగా అవకాశం కల్పించాలని స్థానికులు కోరారు. అదేవిధంగా సంస్థలో ఉద్యోగాలు చేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా ఇప్పించాలని రిటైర్డ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. అనంతరం చెంచు సేవా సంఘం నాయకులు శంకరయ్య, రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఎంపీ రహీం, వెంకటరమణ, గోపాల్‌నాయక్ శాలువా, పూలబొకేతో ఆయనను ఘనంగా సన్మానించారు.

ఊర చెరువులో మొసలి



బీపనగండ్ల: మండల కేంద్రం సమీపంలో ఉన్న ఊరచెరువులో మొసలి సంచరిస్తుండటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. తరచూ బయటకు వస్తుండటంతో అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. అధికారులు స్పందించి చెరువు నుంచి తరలించడంతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కారులో మంటలు



గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగిన ఘటన మంగళవారం ఉదయం పట్టణంలో చోటు చేసుకుంది. ఫైర్ సిబ్బంది, బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని వీవర్స్‌కాలనీకి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఉదయం కారును బయటకు తీసే క్రమంలో ఇంజిన్ నుంచి మంటలు వచ్చాయి. గుర్తించిన యజమాని మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగి ఉండొచ్చని ఫైర్‌సిబ్బంది తెలిపారు.

పంటకు పురుగు మందు కొట్టి.. రైతు మృతి

నవాబుపేట: పంటకు పురుగు మందు కొట్టిన అస్వస్థతకు గురైన ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని లోకిరేవు గ్రామానికి చెందిన రైతు కావలి సత్తయ్య(46) ఈ నెల 3న తన పొలంలో పంటకు పురుగు మందు పిచికారీ చేశాడు. రోజంతా పురుగు మందు కొట్టి అస్వస్థతకు గురై పొలం చెంతనే పడిపోయాడు. దీంతో చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులతో కలిసి 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొంది కోలుకోవడంతో 5న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి వచ్చాడు. అయితే మరుసటి రోజు మరోసారి అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై సత్తయ్య కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

అలంపూర్: పట్టణంలోని వంతెన సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున నంద్యాల జిల్లా బనగానపల్లికి చెందిన ఆదిత్య శశాంక్ (33) మృతదేహం మంగళవారం లభ్యమైందని ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించామన్నారు. తల్లి అనాథ శరణాలయంలో ఉందని.. ఇద్దరు అక్కలు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఘటన స్థలాన్ని సీఐ రవిబాబు పరిశీలించారు.

రిజర్వాయర్ భూసర్వేను అడ్డుకున్న రైతులు



భూ సర్వేను నిలిపి వేయాలని రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

- సర్వే సిబ్బందితో వాగ్వాదం
- మరో సర్వేకు వస్తే దాడులు తప్పవు: రైతులు

బల్మూర్: మండలంలోని బల్మూర్ సమీపంలో నిర్మించనున్న ఉమామహేశ్వర ప్రాజెక్టు సర్వే పనులను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. రైతుల అభిప్రాయ సేకరణ లేకుండా తమకు నష్టం కలిగించే ప్రాజెక్టుపై ఏడాదిగా పోరాటం చేస్తున్న తమతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం చర్చించకుండా పరిహారాలు ఇవ్వకుండానే భూసర్వే చేయడం ఏమిటని వారు సర్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈసందర్భంగా మైలారం–అంబగిరి రోడ్డుపై నిరసన తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంపై కోర్టులో కేసు ఉన్న కూడా నిబంధనలు పాటించకుండా సర్వే చేయడంపై రైతులు మండిపడ్డారు. గతంలో రెండు సార్లు సర్వే పనులను అడ్డుకున్నా మళ్లీ సర్వే చేయడం తగదని, మరోసారి సర్వేకు వస్తే దాడులు తప్పవని రైతులు సర్వే సిబ్బందిని హెచ్చరించారు. దీంతో సర్వే సిబ్బంది వెనుదిరిగారు. కార్యక్రమంలో రైతు నాయకులు తిరుపతయ్య, శివశంకర్, కృష్ణయ్య, రాజేష్, కాగుల మల్లయ్య, శ్రీశైలం,తో పాటు బల్మూర్, అనంతవరం గ్రామానికి చెందిన భూనిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

జోరుగా ఉల్లి విక్రయాలు



అమ్మకానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

క్వింటా గరిష్టంగా రూ.1,800.. కనిష్టంగా రూ.1,200

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం ఉల్లి విక్రయాలు జోరుగా సాగాయి. బుధవారం ఈశ్వర వీరప్పయ్యస్వామి రథోత్సవం ఉండటంతో మార్కెట్‌కు సెలవు ప్రకటించగా.. ఒకరోజు ముందుగానే ఉల్లి వేలం నిర్వహించారు. సుమారు మూడు వేల బస్తాల ఉల్లి మార్కెట్‌కు రాగా.. నాణ్యమైన ఉల్లి ఎక్కడ ఉంటే అక్కడ కొనుగోలుదారుల సందడి కనిపించింది. ఇతర మార్కెట్ల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా ఉల్లిని తక్కువ మొత్తంలోనే కొనుగోలు చేశారు.

నిలకడగా ధరలు..

మంగళవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు నిలకడగానే ఉన్నాయి. ఉదయం 10 గంటలకే వేలం ప్రారంభం కాగా క్వింటా గరిష్టంగా రూ.1,800.. కనిష్టంగా రూ.1,200 ధర పలికింది. మార్కెట్ నిబంధనలు సడలించిన తర్వాత బస్తా 50 కిలోలుగా నిర్ణయించారు. బస్తా ధర గరిష్టంగా రూ.900.. కనిష్టంగా రూ.600 వరకు విక్రయించారు.

తండ్రిపై కొడుకు దాడి

నవాబుపేట: కన్నతండ్రినే ఓ కొడుకు దాడి చేయగా కూతురు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. మండలంలోని కాకర్లపహాడ్‌కి చెందిన గుండు బాలయ్యను అతని కుమారుడు గుండు మోగులయ్య మంగళవారం మద్యం మత్తులో అకారణంగా దాడి చేశాడు. అప్పుడే వచ్చిన బాలయ్య కుమార్తె మైబమ్మ నిలువరించేందుకు ప్రయత్నించింది. ఆమెపై సైతం దాడి చేశాడు. దీంతో మైబమ్మ ఫిర్యాదుతో మోగులయ్యపై కేసు నమోదు చేశామన్నారు.

పునరావాస పనుల్లో వేగం పెంచాలి

- అడ్డంగా ఉన్న స్తంభాలను వేరేచోటికి మార్చండి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉదండాపూర్ నిర్వాసితుల పునరావాస పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్, తుమ్మలకుంటతండా, రేగడిపట్టితండా, చిన్నగుట్టతండా, శామగడ్డ తండా, ఒంటిగుడిసెతండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు, అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద 300 గజాల స్థలం, ప్రైమరీ హెల్త్‌సెంటర్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, పార్కులను త్వరితగతిన పూర్తయ్యేలా చేపట్టాలనిఅధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు ఇచ్చిన గడువులోగా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, రోడ్లు, డ్రెయినేజీలు, సోక్ పిట్స్, ఎలక్ట్రిసిటీ మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్లాట్లకు అడ్డుగా వున్న ఎలక్ట్రిసిటీ స్తంభాలను వేరే చోటికి మార్చాలన్నారు. నిర్వాసితులు దేవాలయానికి స్థలం కేటాయించవలసిందిగా కోరినారని, ముందుగా అనుకున్న సబ్ స్టేషన్ స్థానంలో దేవాలయానికి కేటాయించి, సబ్ స్టేషన్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు స్థలం కేటాయించేందుకు సరిపోకపోతే సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి వెంటనే ప్రపోజల్స్ పంపించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ నవీన్, పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

ఆగ్రహించిన కుటుంబసభ్యులు.. ఆస్పత్రి నిర్వాహకులపై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: గుండె సమస్యతో ఆస్పత్రికి వచ్చిన మహిళ వైద్యుల నిర్లక్ష్యంగా మృతి చెందిందని ఆగ్రహించిన మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చేయడంతో పాటు ఆస్పత్రి నిర్వాహకులపై దాడి చేశారు. జిల్లాకేంద్రంలో ఉన్న ఓ కార్డియాలజీ ప్రైవేట్ ఆస్పత్రిలో నవాబ్‌పేట మండలపరిధిలోని ఓ తండాకు చెందిన 45 ఏళ్ల మహిళ గుండెకు సంబంధించిన సమస్యతో అడ్మిట్ అయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయినట్లు ఆరోపిస్తూ ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. తండా నుంచి యువకులు భారీగా ఆస్పత్రికి తరలిరావడంతో అక్కడ ఉద్రిక్తంగా మారింది. ఆస్పత్రి సిబ్బందికి, బాధిత కుటుంబసభ్యులకు గొడవ ముదరడంతో అక్కడ పని చేసే వైద్యుడితో పాటు నిర్వాహకులు, ఇతర సిబ్బందిపై దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో బాధితులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి దుర్మరణం

నందిగామ: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ శివారులోబైపాస్ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన ఆంజనేయులు(48) భిక్షాటనతో పాటు ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు సేకరించి అమ్ముకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో 44వ నంబరు జాతీయ రహదారిపై రంగాపూర్ శివారులోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు తీవ్రగాయాలకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆంజనేయులు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత స్థానికులు 108కు కాల్ చేస్తే అంబులెన్స్ వాహనం సకాలంలో రాలేదని.. లేదంటే తన భర్త బతికేవారని మృతుడి భార్య ఆరోపించారు.

క్లుప్తంగా

వర్ధంతి సభలు విజయవంతం చేయండి

ఎర్రవల్లి: ఈనెల 10 నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జార్జిరెడ్డి 53వ వర్ధంతి వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జార్జిరెడ్డి ఆశయాల సాధనకు విద్యార్థులు పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జమ్మిచేడు కార్తీక్, దానయ్య, అంజి, తిరుమలేష్, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

అలంపూర్: అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ గువ్వల శ్రీనివాసులు ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాది మహమ్మద్ ముత్తబా ఆలీపై జరిగిన దాడిని ఖండిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నాగరాజు యాదవ్, మధు, ఈదురు బాష, గజేంద్ర గౌడ్, టీవీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో మారమునగాల గ్రామానికి చెందిన మిర్చి లోడ్ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు వాహనదారులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన గడ్డమీది రాజు గద్వాలలోని జములమ్మ దేవాలయానికి బైక్‌పై వచ్చి వెళ్తుండగా పరుమాల స్టేజీ సమీపంలో అయిజ నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రరక్త గాయాలైన క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

బస్సును ఢీకొట్టిన లారీ

మానవపాడు: జాతీయ రహదారి–44పై వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న లారీఢీ కొట్టిన ఘటన మండలంలో మంగళవారం చోటు చుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్ వైపుగా వెళ్తున్న ప్రైవేట్ బస్సు జాతీయ రహదారిపై చెక్‌పోస్ట్ సమీపంలో సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులోని నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఒకరికి తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఆలోచన పండుగ విజయవంతం చేద్దాం

శాంతినగర్: ఈనెల 12న నిర్వహించనున్న అంబేడ్కర్ ఆలోచన పండుగను విజయవంతం చేయాలని నాయకులు హుస్సేన్, సురేందర్ కోరారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ అంబేడ్కర్ చౌక్ వద్ద ఆలోచన పండుగ వాల్‌పోస్టర్ మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, బలిగేర మోజేష్, అశోక్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

గట్టు : మండల పరిధిలోని ఆరగిద్ద గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పటేల్ గంగమ్మ(110) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఆరు మంది కుమార్తెలున్నారు. పెద్ద కుమారుడు తిమ్మారెడ్డి పట్వారీగా పనిచేసి, మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండో కుమారుడు రాంచంద్రారెడ్డి పట్వారీగా వీఆర్‌ఓగా పని చేసి, పదవీ విరమణ పొందాడు. మనవళ్లు, మునిమనవళ్లను గంగమ్మ చూసింది. శతాధిక వృద్ధురాలి మృతి పట్ల గ్రామస్తులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

యువతి అదృశ్యం

గద్వాల క్రైం: యువతి అదృశ్యమైన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన ఓ యువతి(23) ఎనిమిది నెలల క్రితం జీవనోపాధి కోసం జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో విధులు నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి ఉంటుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం పని నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిందన్నారు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడం, ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో యువతి తండ్రి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత



ఎర్రవల్లిలో బాలల సంరక్షణపై అవగాన కల్పిస్తున్న అధికారులు

ధరూరు/అయిజ/రాజోళి/కేటీదొడ్డి/ఎర్రవలి: బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని డీసీపీఓ నర్సింహ అన్నారు. బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని మార్లబీడు గ్రామంలో స్త్రీ,శిశు సంక్షేమ బాలల పరిరక్షణ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీఓ మాట్లాడారు. బాలలపై శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై జరిగే వేధింపులపై 1098కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సబిత, బీపీఎం యువరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతాప్, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

★ అయిజ మండలంలోని వెంకటాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ శివలీల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని గుర్తించాలన్నారు.

★ తల్లిదండ్రులు పిల్లల్లో పౌష్టికాహార లోపాలను గుర్తించాలని చైల్డ్ వెల్ఫేర్ ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం రాజోళి మండలంలోని తూర్పు గార్లపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలల సంరక్షణ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. కమిటీ సభ్యులు గ్రామంలో బాలబాలికలపై దృష్టి పెట్టాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ, ప్రధానోపాధ్యాయురాలు ఆశ, కానిస్టేబుల్ అయ్యన్న, బుజ్జమ్మ బాలల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

★ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని చైల్డ్‌హెల్ప్ కౌన్సిలర్ జయన్న అన్నారు. కేటీదొడ్డి మండలంలోని మల్లాపురం పాఠశాలలో బాలల పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

★ ఎర్రవల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ సుజాత, జిల్లా బాలల సంరక్షణ అధికారి జోగురవి హాజరై బాలల చట్టాలతో పాటు వారి సమస్యలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలల సంరక్షణ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయ్యమ్మ, కార్యదర్శి రంగన్న తదితరులు పాల్గొన్నారు.



ధరూరులో సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీఓ నర్సింహ

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి



గట్టు కస్తూర్బా పాఠశాలలో ల్యాబ్‌ను సందర్శిస్తున్న రాయాపురం విద్యార్థులు



మల్దకల్‌లో వాటర్‌ప్లాంటు ప్రారంభోత్సవంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ, అధికారులు

మల్దకల్/ఉండవెల్లి/కేటీదొడ్డి/గట్టు: మండల పరిధిలోని ఓ గ్రామంలో పాఠశాలలను అనుసంధానంగా చేసుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించడమే ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ ప్రధాన లక్ష్యమని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ అన్నారు. మంగళవారం మల్దకల్ జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రెండు వేర్వేరు పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల నైపుణ్యాలపై వేర్వేరుగా వివరిస్తూ వారికి అవగాహన కల్పించారు. వీటి ద్వారా విద్యార్థులలో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసుకునే వీలుంటుందన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులు కూడా తమ బోధన మెళకువలను మెరుగుపరచుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసి వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎస్ఐ నందికర్, హెచ్ఎం నరేష్, హంపయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ముజీబ్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

★ ఉండవెల్లి మండలంలోని బొంకూరు పాఠశాలలో డిజిటల్ బోధనపై మంగళవారం మానవపాడు మండలం కొర్విపాడు పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి అవగాహన కల్పించారు. టెక్నాలజీ పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు మేధస్సును పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

★ ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమం ద్వారా పాఠశాలల నిర్వహణ తీరులో గణనీయమైన మార్పు వస్తోందని మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి రంగాపురం పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రాఫ్ట్ తయారీ, ఆర్ట్ టీచర్ గీసిన బొమ్మలు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యప్రకాష్, వేణుగోపాల్, ఉపాధ్యాయులు వెంకటేష్, వెంకట్‌రెడ్డి, పాండు నాయక్, కర్రెప్ప, తదితరులు పాల్గొన్నారు.

★ గట్టు మండల పరిధిలోని రాయాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలను సందర్శించారు. సాంకేతికలను పంచుకోవడం, ఉత్తమ అభ్యాసాలను గుర్తించడం, టీచర్ల సహకారంతో విద్యార్థుల నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించుకోవడంలో భాగంగానే సందర్శించిన్నట్లు ఉపాధ్యాయులు రాజుసాగర్, శ్రీను తెలిపారు. ప్రయోగశాల, క్రీడా గది, డిజిటల్ తరగతి గది, ల్యాబ్‌లు పరిశీలించారు. బాలికల సాధికారత క్లబ్బు సమర్థవంతంగా నడుస్తున్నట్లు ఎస్ఓ గోపిలత తెలిపారు. కార్యక్రమంలో కస్తూర్బా టీచర్లు రేణుక, రేష్మ, అనురాధ, పుష్ప, కవిత, రాణి, అంజనమ్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

★ మానవపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమాన్ని ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కంప్యూటర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ ధరలు తగ్గించాలని నిరసన

అలంపూర్: సిలిండర్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, ఈదన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సిలిండర్‌తో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచడంతో పాటు, గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం విడ్డురంగా ఉందన్నారు. వెంటనే గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహ, అలీ అక్బర్, ఆశన్న, నాగరాజు, జయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంతి జయప్రదం చేయాలి

ఇటిక్యాల: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ అల్లంపూర్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన మహా పురుషుడు పూలే అని కొనియాడారు. ఈనెల 11న జరిగే పూలే జయంతికి సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జాన్, ఏసు, రాజ్, నల్లన్న, దావీద్, జమ్మన్న, బాష తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థపై అవగాహన

అయిజ: మండలంలోని వేణిసోంపురం గ్రామంలో మంగళవారం స్థానిక పరిపాలనపై పాఠశాల విద్యార్థులకు గ్రామ పంచాయతీ క్లస్టర్ ప్రాజెక్ట్ జిల్లా సమన్వయకర్త పవన్‌కుమార్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్మాణం, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యుల బాధ్యతలు విధుల గురించి విద్యార్థులకు అధికారులు వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయుడు నగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు

ఎర్రవల్లి: కొంత కాలంగా బీచుపల్లి గ్రామ పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన నర్సమ్మ కొంత కాలంగా ప్రభుత్వ స్థలంతోపాటు రోడ్డును కూడా కబ్జా చేసుకుందన్నారు. దీంతో నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే విజయుడు మంగళవారం పంపిణీ చేశారు. అయిజ, ఇటిక్యాల, మండలాలకు చెందిన 88 మంది లబ్ధిదారులకు రూ.20 లక్షల విలువైన చెక్కులు, ఉండవెల్లి, మానవపాడు, అలంపూర్ మండలాలకు చెందిన 71 మంది లబ్ధిదారులకు, రూ.17 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అద్దె బకాయిలు చెల్లించాలి

గట్టు: గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించిన అద్దె బకాయిలు పంచాయతీకి చెల్లించాలని ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీఓ రవికుమార్, కార్యదర్శి మునినాయక్ షాపింగ్ యజమానులకు సూచించారు. మంగళవారం గట్టు బస్టాండ్ ఆవరణలో గ్రామ పంచాయతీకి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌లను వారి పరిశీలించి షాపు యజమానులతో మాట్లాడారు. అద్దె చెల్లించని వారికి తక్షణమే నోటీలను జారీ చేయాలని సిబ్బంది ఆదేశించారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు రమా సాయిబాబా

ఎర్రవల్లి: రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అక్కల రమా సాయిబాబా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సీసీ రోడ్లు వేస్తుందన్నారు. ఇందులో ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేయడం లేదన్నారు. సన్నబియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు అందిస్తుండగా.. రాష్ట్రం ప్రభుత్వం కేవలం కిలో మాత్రమే ఇచ్చి ఫొటోలకు పోజులిస్తూ దొంగ డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఫొటోను అధికారికంగా పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వప్న, శ్రీనివాసరెడ్డి, విజయ్, పరుశరాం, నరేష్, నర్సింహారెడ్డి, రాముడు, యాదగిరి, నరేష్‌గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత బెట్టింగ్ జోలికి పోవద్దు

ఎర్రవల్లి: యువత బెట్టింగ్ జోలికి పోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బీచుపల్లిలో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం సభ్యులు ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, చైల్డ్‌లేబర్, విద్యార్థులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలపై ఆటపాటల రూపంలో అవగాహన కల్పించారు. రహదారి భద్రతా నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కేశవరావు, హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, కళాబృందం సభ్యులు కృష్ణ, రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అందుబాటులోకి తేవాలి

శాంతినగర్ : అలంపూర్ చౌరస్తాలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిలో వైద్యులను నియమించి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రిని కోరుతూ మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ భద్రప్పకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 27 కోట్లు ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన ఆస్పత్రిని నిర్మించి వదిలేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆస్పత్రిని వెంటనే అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్ మాదిగ, యేసేపు, బడేసాబ్, రాంగోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగరాణి

మల్దకల్: పౌష్టికాహారంతోనే గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, చైల్డ్‌లైన్ ప్రకాష్ అన్నారు. మంగళవారం మల్దకల్ అంగన్‌వాడీ కేంద్రం–6లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు పాలు, పండ్లతో పాటు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. అదే విధంగా నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. బరువు, ఎత్తు తక్కువగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుమలేష్, బ్లాక్ కోఆర్డినేటర్ శశికళ, సురేఖమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ మొగలయ్య

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రహదారి పక్కన అక్రమంగా రెండు షెటర్లను ముందుకు నిర్మిస్తున్నారని బీజేపీ నాయకులు ఫిర్యాదులో మంగళవారం డీఎస్పీ మొగలయ్య స్థానిక పోలీసుస్టేషన్‌లో ఇరువర్గాల వారితో సానుకూలంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఖబరస్తాన్‌లో నిర్మించిన రెండు షెట్టర్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతారని, వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శి బాషాకు గతవారం బీజేపీ నాయకులు, హిందు సంఘాలు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు డీఎస్పీ రంగలోకి దిగారు. రహదారికి అడ్డుగా ఉన్న నిర్మాణాన్ని కొద్దిగా జరిపి నిర్మించుకోవాలని డీఎస్పీ తెలపడంతో ముస్లిం సంఘాలు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవిబాబు, ఎస్ఐ మహేష్, గ్రామ పెద్దలు, శివారెడ్డి, లోకారెడ్డి, దామోదర్‌రెడ్డి, జగదేవయ్య, మగ్బుల్, మక్తర్ బాషా, యూసుఫ్ తదితరలుఉ పాల్గొన్నారు.

అయిజను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

అయిజ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అతి పెద్ద మండలమైన అయిజను ప్రభుత్వం నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దక్షిణాన చిట్టచివరన ఉన్న అయిజను రెవెన్యూ డివిజన్‌గా చేస్తేనే మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అయిజ పట్టణ జనాభా 28,000 ఉందని, అయిజలో సంగ భాగం జనాభా లేని పెబ్బేరును రెవెన్యూ డివిజన్‌గా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిదన్నారు. రెవెన్యూ డివిజన్ చేయని పక్షంలో నడిగడ్డలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, గోపాలకృష్ణ, వెంకటేష్, మహేష్, రాజశేఖర్, గోపాల్, శివన్న, భీముడు, రామకృష్ణ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించాలి



ధరూరు సమావేశంలో మాట్లాడుతున్న స్నిగ్ధారెడ్డి

గద్వాలటౌన్/గట్టు/ధరూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట్రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందదర్భంగా బండల వెంకట్రాములు మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి 14 వరకు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగుర వేయాలన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టంపై కొంత మంది బీజేపీని బదనాం చేస్తున్నారని, కొంత మంది పెద్దలు వక్ఫ్ బోర్డుకు చెందిన రూ.కోట్లు విలువ చేసే భూములను స్వలాభం కోసం ఉపయోగించారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలతో ప్రజలను మోసం చేసినట్లు ఆరోపించారు. కార్యక్రమలలో బీజేపీ నాయకులు మధుసూదన్‌రావు, నాగప్ప, చిత్తారి కిరణ్, పాండురెడ్డి, కిట్టుస్వామి, మాచర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

★ గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ధరూరు మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తిమ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నిగ్ధారెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో వార్డు స్థితి గతులను పరిశీలించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 10, 11, 12వ తేదీల్లో చెరువులు, కుంటలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ సంజీవ్ భరద్వాజ్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేష్, కిష్టన్న, జనార్దన్, హన్మంతరాయ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

★ ప్రజలు పదేళ్ల బీఆర్ఎస్ పాలన చూశారని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలన చూస్తున్నారని, ఈ రెండు పార్టీలపై ప్రజలు విరక్తి చెందారని బీజేపీ సీనియర్ నాయకుడు ధరూర్ కిష్టన్న ధ్వజమెత్తారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గద్వాలలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన ' గావ్ చలో బస్తీ చలో ' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండల వెంకట్రాములు, జయశ్రీ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాల అమలు

ఎర్రవల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జింకలపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా ప్రజలకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రుక్మాందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మద్దిలేటి, సర్వేష్, ఈరన్న, ఈదన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు, రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు అయ్యన్న ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి


అలంపూర్: మున్సిపాలిటి పరిధిలోని గాంధీ సెంటర్ నుంచి మెయిన్ బజార్ వరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయ్యన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



రాజోళి: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులుగా మారి ప్రతిభ చాటారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మల్దకల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం మల్దకల్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మోసపూరితమైన మాటలతో ప్రజలను మభ్యపెడుతూ కాలం వెల్లదీస్తుందని అన్నారు. రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వ వాటా గురించి చెప్పకుండా డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి రేషన్ షాపు వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను అధికారికంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పాల్వాయి రాముడు, తిరుపతిరెడ్డి, రాముడు, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగరాజు, రెడ్డప్ప, తిమ్మారెడ్డి, వెంకటేక్ తదితరులు పాల్గొన్నారు.